కొరవడిన నిఘా

- వీఆర్ఏ వ్యవస్థ రద్దుతో పర్యవేక్షణ కరువు
- గ్రామాలకు–ప్రభుత్వానికి మధ్య అనుసంధానం కట్
- మళ్లీ రెవెన్యూలోకి తీసుకోవాలని వేడుకోలు

కందుకూరు: గ్రామాలకు–ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండి, నిత్యం ప్రభుత్వ పథకాలు అమలయ్యేలా చూడటంతో పాటు అధికారులకు గ్రామాల్లో జరిగే ఘటనలు, మంచి, చెడులకు సంబంధించిన సమాచారం ఇవ్వడంలో వీఆర్ఏల వ్యవస్థ సమర్థవంతంగా పని చేసేది. కానీ గత ప్రభుత్వం ఆ వ్యవస్థను రద్దు చేసి వీఆర్ఏలను ఇతర శాఖలకు బదిలీ చేయడంతో ఎవరూ ఊహించని సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా రెవెన్యూ వ్యవస్థకు వీఆర్ఏలు లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. ఇది ఒక్క గ్రామం, మండలానికి చెందినది కాదు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సమస్య.

పూర్తిగా కొరవడిన నిఘా..

నవాబుల కాలం నుంచే గ్రామాల్లో గ్రామ పోలీస్‌గా, కావలికారు పేర్లతో గ్రామాలను పర్యవేక్షించే పనులను వీఆర్ఏలు చేసేవారు. సర్పంచ్‌ల వ్యవస్థ ఆ తర్వాత మండల వ్యవస్థ ఏర్పడిన తర్వాత నుంచి కూడా వీఆర్ఏలే ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానకర్తలుగా వ్యవహరించేవారు. ముఖ్యంగా రెవెన్యూ వ్యవస్థకు మూలస్తంభంగా ఉన్న వారిని గత ప్రభుత్వం 2023 జూలై నెలలో ఇతర శాఖలకు బదిలీ చేసింది. కాకపోతే అప్పటి నుంచే గ్రామాల్లో పూర్తిగా నిఘా కొరవడింది.

కొనసాగుతున్న అక్రమాలు..

వీఆర్ఏల వ్యవస్థ కొనసాగినప్పుడు గ్రామాల్లో అవసరమైన సమాచారాన్ని అధికారులకు చేరవేయడం, అవసరమైన పనులను దగ్గర ఉండి చేసేవారు. ప్రస్తుతం వారి సేవలు అందుబాటులో లేకపోవడంతో గ్రామాల్లో కుంటలు, చెరువులు, ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా, మరోపక్క అసైన్డ్, పట్టా భూముల్లో విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు చేపడుతున్నా వాటిని అరికట్టేవారు కాని, అధికారులకు సమాచారం ఇచ్చే వారు కాని లేరు. దీంతో అక్రమాలు యథేచ్ఛగా కొనసాగుతూనే ఉన్నాయి. ఒక్క కందుకూరు మండలాన్ని తీసుకుంటే గతంలో 54 మంది వీఆర్ఏలు పని చేసేవారు. గ్రామ విస్తీర్ణాన్ని బట్టి ఒకరు, ఇద్దరు, లేదు ముగ్గురు నుంచి నలుగురు చొప్పున గ్రామాల్లో విధులు నిర్వర్తించేవారు. ప్రస్తుతం అక్రమాలను ఆపాలంటే కిందిస్థాయి ఉద్యోగుల కొరత కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించాలంటే ఆర్ఐలు, తహసీల్దార్లకు తలకు మించిన భారంగా మారింది. ప్రభుత్వం గ్రామాలను పర్యవేక్షించేలా గ్రామానికి కనీసం ఒక్క వీఆర్ఏనైనా నియమిస్తే సమస్యలు కొంత మేర అరికట్టవచ్చు.


కందుకూరు తహసీల్దార్ కార్యాలయం


ప్రభుత్వ భూమిలో అక్రమంగా చేపట్టిన మట్టి తవ్వకాలు

మళ్లీ రెవెన్యూలోకి తీసుకోవాలి



వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం సంతోషంగానే ఉంది. మమ్మల్ని ఇతర శాఖలకు బదిలీ చేశారు. ప్రస్తుతం నేను మిషన్ భగీరథలో హెల్పర్‌గా పని చేస్తున్నాను. తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకుంటే బాగుంటుంది.

– నర్సింహా, ఉద్యోగి, ముచ్చర్ల

అనుసంధానం కట్ అయింది..

వీఆర్ఏల వ్యవస్థను రద్దు చేయడంతో గ్రామాల్లోని ప్రజలకు ప్రభుత్వానికి అనుసంధానం కట్ అయింది. గ్రామాల్లో అన్ని శాఖలపై నిఘా లేకుండా పోయింది. ఏవైనా అక్రమాలు జరిగితే తక్షణం స్పందించేలా బాధ్యత తీసుకునే ఉద్యోగి లేరు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మళ్లీ వీఆర్ఏల వ్యవస్థను పునరుద్ధరించాలని కోరతాం.

– ఏనుగు జంగారెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు, దెబ్బడగూడ

క్లుప్తంగా

డిక్షనరీలు పంపిణీ


డిక్షనరీలు పంపిణీ చేస్తున్న అసోసియేషన్ నిర్వాహకులు

కందుకూరు: మండల పరిధిలోని గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కాకుండా తల్లిదండ్రులు, గురువులతో గౌరవంగా మెలగాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి కె.వెంకటేశ్వర్లుగుప్తా, కార్యదర్శి విజయ్, జిల్లా కార్యదర్శి మల్లేశ్, జనరల్ సెక్రటరీ రవి, మండల ప్రెసిడెంట్ భరత్, గ్రామస్తులు చిందం శ్రీశైలం, హెచ్ఎం కిషన్, ఉపాధ్యాయులు ఎండీ ఆయూబ్, రోనాలిని పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న నర్సింహా తదితరులు

కందుకూరు: విద్యార్థులు మంచి లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని మండల పరిధిలోని మాన్యగూడకు చెందిన కాంగ్రెస్ నాయకుడు ఎగిరిశెట్టి నర్సింహా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలోని విద్యార్థులకు రూ.10వేల విలువ గల పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఆయన వెంట మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధరణి సమస్యలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించండి: సీపీఎం


సీఐని సత్కరిస్తున్న ఎస్ఐ బల్‌రాం

యాచారం: ధరణి స్పెషల్ డ్రైవ్ ద్వారా గ్రామాల్లో ఉన్న భూసమస్యలన్నీ పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ కోరారు. ఈ మేరకు యాచారం తహసీల్దార్ అయ్యప్పను మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామంలో వందలాది భూ సమస్యలు ఉన్నాయని.. వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా గ్రామ పంచాయతీల వద్ద ప్రజల సమక్షంలోనే భూ సమస్యలు విని అక్కడికక్కడే పరిష్కరిస్తే బాగుంటుందని కోరారు.

బాధ్యతల స్వీకరణ


చిన్నారెడ్డిని సన్మానించిన నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా డి.ప్రమోద్‌కుమార్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన విజయ్‌కుమార్ బదిలీ కాగా అల్వాల్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న సీఐ ప్రమోద్‌కుమార్ ఆమనగల్లుకు బదిలీపై వచ్చారు. ప్రమోద్‌కుమార్‌ను స్థానిక ఎస్ఐ బల్‌రాం, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

చిన్నారెడ్డి నియామకంపై హర్షం

తలకొండపల్లి: రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్‌గా ఎన్నికైన మాజీ మంత్రి చిన్నారెడ్డిని పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, శతాబ్ది టౌన్‌షిప్ డైరెక్టర్ శ్రీనివాసురెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. చిన్నారెడ్డి సలహాలు, సూచనలు, మార్గదర్శకత్వంలో రాష్ట్రం మరింత ముందుకు వెళ్తుందని వారు అభిప్రాయపడ్డారు. పాలమూరు బిడ్డ చిన్నారెడ్డి ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్‌గా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ తల్లి భక్తుల ఇలవేల్పుగా మారింది. అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అమ్మవారికి ఇష్టమైన రోజు మంగళవారం కావడంతో అర్చకులు ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారికి బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. అనంతరం సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, సిబ్బంది కాశీనాథ్, అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం సందర్శన

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నంలోని ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగ విద్యార్థుల కేంద్రాన్ని మంగళవారం వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాళ్ల జంగయ్య సందర్శించారు. దివ్యాంగ పిల్లలకు విద్యా బోధన చేస్తూ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి


కేలండర్ ఆవిష్కరిస్తున్న యాదవ్ సంఘం నాయకులు, సీఐ తదితరులు


కందుకూరు: యాదవులు విద్య, వ్యాపార, రాజకీయ రంగాల్లో రాణించాలని యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్ సూచించారు. మండల కేంద్రంలో సోమవారం రాత్రి యాదవ సంఘం మండల అధ్యక్షుడు పసుపుల పర్వతాలుయాదవ్ ఆధ్వర్యంలో సీఐ మక్బూల్‌జానీతో కలిసి ఆయన నూతన కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదవుల్లో పేద విద్యార్థులు, పేదలను అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. అందుకు అందరూ సంఘటితంగా మారి సేవా రంగాల్లో ముందుండి ఆదర్శంగా మారాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రావణ్, యాదవ సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు మేకల కృష్ణయాదవ్, మాజీ మండల అధ్యక్షుడు కన్నయ్యగారి బాల్‌రాజ్‌యాదవ్, ఆ సంఘం నాయకులు లక్ష్మయ్యయాదవ్, సుధాకర్‌యాదవ్, నర్ల రాములుయాదవ్, నర్ల నరసింహాయాదవ్, సాటు మైసయ్యయాదవ్, రామకృష్ణయాదవ్, జనార్ధన్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, వెంకటగిరియాదవ్, భిక్షపతియాదవ్, హనుమంతుయాదవ్, మల్లేశ్‌యాదవ్, శ్రీనుయాదవ్, వెంకటేశ్‌యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షుడు నాగేశ్‌యాదవ్, రాజుయాదవ్, కృష్ణయాదవ్, ఆంజనేయులుయాదవ్, యాదయ్యయాదవ్, శ్రీశైలంయాదవ్, సత్యంయాదవ్, విశ్వనాథ్‌యాదవ్, సత్యంయాదవ్, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

కేంద్ర బలగాలతో పోలీసు కవాత్


కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి

పహాడీషరీఫ్: రాబోయే పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా తగిన చర్యలు తీసుకుంటామని మహేశ్వరం ఏసీపీ పి.లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని షాహీన్‌నగర్ ప్యారడైజ్ ఫంక్షన్‌హాల్ నుంచి ఎర్రకుంటలోని పింక్ ప్యాలెస్ వరకు మంగళవారం సాయంత్రం కేంద్ర బలగాలతో పోలీసు కవాత్ నిర్వహించారు. బాలాపూర్, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్లు భూపతి, గురువారెడ్డిలతో కలిసి ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతి ఓటర్ నిర్భయంగా పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేసే వాతావరణాన్ని కల్పిస్తామన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. నేరాల నియంత్రణ కోసం స్థానిక ప్రజలతో అవగాహన కార్యక్రమాలు కూడా చేపడతామన్నారు. కార్యక్రమంలో బాలాపూర్, పహాడీషరీఫ్ ఠాణాల డీఐలు మధు, సుధీర్ కృష్ణ, ఎస్సైలు మహేందర్ జానీ, మధు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంచడానికి కృషి చేయాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

హుడాకాంప్లెక్స్: పార్లమెంటు ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్పెషల్ ఆఫీసర్ భవాని శంకర్ పేర్కొన్నారు. మంగళవారం సరూర్‌నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో స్వీప్–2024 పేరుతో బీఎల్‌ఓ, బీఎల్‌ఓ సూపర్‌వైజర్, మెప్మా సిబ్బందికి ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భవాని శంకర్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా, అదేవిధంగా ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్, డీఆర్డీఓ శ్రీలత, సరూర్‌నగర్ మండల తహసీల్దార్ వేణుగోపాల్, డీటీ ఆదిత్య, ఆర్ఐ యాదగిరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు రేషన్, స్టేషనరీ


రేషన్ సరుకులు, వస్తువులను అందజేస్తున్న రఘుకుమార్, విజయలక్ష్మి దంపతులు

దిల్‌సుఖ్‌నగర్: తుర్కయంజాల్ కాలనీకి చెందిన రఘుకుమార్ విజయలక్ష్మి అమెరికాలో ఉంటున్న తమ కుమారుడు జగదీశ్వర సాయికృష్ణ, కోడలు నిఖిత పెళ్లి రోజు సందర్భంగా మంగళవారం ఆర్కేపురం డివిజన్‌లోని చిత్ర లేఅవుట్‌లోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు చేయూత అందించారు. గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్ సమక్షంలో విద్యార్థులకు రూ. 48,500 విలువ గల రేషన్‌తో పాటు విద్యార్థులకు అవసరమైన స్టేషనరీ సామగ్రి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా రఘుకుమార్ మాట్లాడుతూ, గృహ విద్యార్థుల కోరిక మేరకు బియ్యం, పప్పులు, ఆయిల్స్, కాలిక్యులేటర్లు, స్టేషనరీ తదితరాలను విరాళంగా అందజేశామన్నారు. అనంతరం విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రఘుకుమార్ దంపతులకు గృహం అధ్యక్షుడు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సాహం

హస్తినాపురం: విద్యతో పాటు క్రీడల్లో రాణించే విధంగా తాము అన్ని విధాలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని కిండిల్ కిడ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ మేదా నందితారెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని లక్ష్మీనర్సింహపురం కాలనీలోని కిండిల్ కిడ్స్ స్కూల్ 7వ క్రీడలు, స్కూల్ వార్షికోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ నందితారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిని ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, విద్యతోపాటు విద్యార్థులకు క్రమ శిక్షణను అలవర్చే విధంగా విద్యాబోధన చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ మేదా గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


కిండిల్ కిడ్స్ స్కూల్ వార్షికోత్సవంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

భక్తిభావం కలిగి ఉండాలి

మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్

తలకొండపల్లి: ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని చీపునుంతల్లో మంగళవారం శివస్వాములు మహాపడిపూజను నిర్వహించారు. 41రో జులు భక్తి శ్రద్ధలతో శివదీక్షలు చేపట్టిన శివ స్వాములు.. గురుస్వామి సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన శ్రీనివాస్‌యాదవ్ పూజ ఖర్చుల నిమిత్తం రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమములో బాలకుమార్‌గౌడ్, జంగయ్య, నారాయణ, మహేష్ పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల గిరిజన విద్యాలయంలో ఎస్ఎస్‌సీ విద్యార్థులకు మంగళవారం మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఫరీద్ పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. ఫరీద్ మాట్లాడుతూ.. పరీక్షలు మంచిగా రాసి ఉత్తీర్ణులు కావాలని కోరారు. ఫలితాల్లో 10/10 గ్రేడ్ సాధించిన విద్యార్థులకు రూ.5 వేల నగదు బహుమతి అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యాలయ ప్రత్యేకాధికారి పద్మజ్యోతి, ఎన్ఎస్‌యూఐ నాయకులు మహేశ్, అబ్దుల్, రాహుల్, పవన్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఎస్ఎస్ ఆటోమొబైల్ సీఈఓ శ్రీమాన్

మొయినాబాద్: విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించాలని ఎస్ఎస్ ఆటోమొబైల్ సీఈఓ శ్రీమాన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 'ఇన్విక్టా–2024' పేరుతో మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కళలు, క్రీడలపైనా ఆసక్తి పెంచుకోవాలన్నారు. కళాశాలల్లో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభ పాటవాలను ప్రదర్శించాలన్నారు. ఎవరికి ఏ రంగంలో ప్రతిభ, నైపుణ్యం ఉందో ఇలాంటి కార్యక్రమాల ద్వారా బయటకు వస్తుందన్నారు. రాష్ట్రంలోని సుమారు 50 కళాశాలల నుంచి విద్యార్థులు ఇన్విక్టాలో పాల్గొన్నారు. డ్యాన్స్, సంగీతం, నాటకం, ఛాయాచిత్రం వంటి కళలను ప్రదర్శించారు. బాస్కెట్ బాల్, వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్ వంటి ఔట్‌డోర్ గేమ్స్, చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్ వంటి ఇన్‌డోర్ గేమ్స్ ఆడారు. సాంస్కృతి, క్రీడా కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో మొయినాబాద్ ఎస్సై కిషన్‌జీ, కార్యక్రమంలో ప్రిన్సిపల్ సత్యానారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ నర్సయ్య, డీఎస్ఏహెడ్ ఉదయశ్రీ, ఫిజికల్ డైరెక్టర్లు కావేరి, సంకేత్, స్పోర్ట్స్ కన్వీనర్లు వినయ్‌సాయి, కల్చరల్ కన్వీనర్లు శాంతి, హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం


ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ ట్రస్టీ సభ్యులు, నాయకులు

మహేశ్వరం: ఘట్టుపల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో జరగనున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్యే సబితారెడ్డికి ఆలయ ట్రస్టీ సభ్యులు, వేద పండితులు, గ్రామ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. వీరాంజనేయస్వామి ఆలయం స్వయంభూ వెలసిందని, ప్రతియేటా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వైభవంగా నిర్వహించాలని నిర్వాహకులను ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆలయ ట్రస్టీ సభ్యులు కోరుపోలు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎస్.శ్రీశైలం, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ ఎండి. సాదత్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, బి.రవి, స్వామి, గోవర్ధన్‌రెడ్డి, ఎర్ర శంకరయ్య, శేఖర్, ఆంజనేయులు, నర్సింహ, వినోద్, బాలు నాయక్, ఆలయ పూజారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు

ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం ఎంపీపీ పీ.కృపేశ్ సూచించారు. ఆయన అధ్యక్షతన మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. మార్చి 1వ తేదీ నుంచి అర్హులైన వినియోగదారులకు జీరో విద్యుత్ బిల్లు రావాల్సి ఉండగా ఎప్పటి మాదిరిగానే బిల్లులు వచ్చాయని దీంతో జనం అయోమయంలో ఉన్నారంటూ పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. తెల్ల రేషన్ కార్డున్నప్పటికీ కొందరికి రూ.వందల్లో బిల్లు వచ్చినమాట వాస్తవమేనని ముందు వీటిని సరిచేస్తామని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. వీరు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదని ఒకవేళ చెల్లించినా వచ్చే బిల్లులో వారి ఖాతాలో జమ అయినట్లుగానే వస్తుందని చెప్పారు. ఇంకా ఎవరికైనా సందేహాలుంటే తెల్లరేషన్ కార్డు, ఆధార్ నంబరు, ప్రజా పాలన దరఖాస్తు రసీదు, కరెంట్ బిల్లుతో స్థానిక విద్యుత్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. కరోనాకు ముందు ఇబ్రహీంపట్నం నుంచి పోల్కంపల్లి, అనాజ్‌పూర్ మీదుగా హయత్‌నగర్ బస్సు నడిచేదని తిరిగి ఈ బస్సును పునరుద్ధరించాలని పోల్కంపల్లి ఎంపీటీసీ చెరుకూరి మంగ రవీందర్ ఆర్టీసీ అధికారులను కోరారు.

రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయండి..

మండలంలో పౌరసరఫరాల శాఖకు సంబంధించిన మొత్తం 37 రేషన్ దుకాణాలుండగా ఏడు చోట్ల ఖాళీలు ఉన్నాయని వీటిని భర్తీ చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో ప్రస్తుతం మండలంలో 1135 మంది కూలీలు పనిచేస్తున్నారని ఈపథకం ద్వారా ఇప్పటికే రూ.512 కోట్లు ఖర్చు చేసినట్లు ఇన్‌చార్జి ఏపీఓ తిరుపతిచారీ తెలిపారు. గత ఆరు వారాలుగా కూలీలకు బిల్లులు రావాల్సి ఉందన్నారు. ఎన్‌పీసీ క్లియర్ రాగానే వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ అధికారులను కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ మంచిరెడ్డి వెంకట ప్రతాప్‌రెడ్డి, తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ వెంకటమ్మ, డీఆర్‌డీఓ ఏపీడీ సక్రియానాయక్, పంచాయతీరాజ్ ఏఈ ఇంద్రాసేనారెడ్డి, ఇరిగేషన్ ఏఈ రాజ్యలక్ష్మి, ఐకేపీ ఏపీఎం రవీందర్‌తో పాటు ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామం


మహాపడి పూజ నిర్వహిస్తున్న రాచలింగం

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని చాకలిగూడలో శివస్వాముల ఇరుముళ్ల పూజలో శివనామస్మరణం మార్మోగింది. మంగళవారం మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన చాకలిగూడలో శివప్ప ద్వదశ జ్యోతిర్లింగ మహాపడిపూజను ఎంపీటీసీ అర్చన యాదయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాచలింగం గురుస్వామి ఆధ్వర్యంలో వైభవంగా పూజా విధానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ అర్చన మాట్లాడుతూ.. దైవచింతనతో భక్తిభావన పెరుగుతుందని తెలిపారు. ప్రజలు తమ ఇష్టదైవాన్ని ఆరాధించాలని సూచించారు. శివమాల ధరించిన భక్తులు ఇరుముళ్లతో జ్యోతిర్లింగాలను వెలిగించారు. రవి గురుస్వామి, కన్నెస్వాములు హర్షవర్ధన్, అఖిల్, గ్రామస్తులు, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.